క్లుప్తంగా

పచ్చాలమ్మ దేవతకు పొంగళ్లు


ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామదేవత శ్రీ పచ్చాలమ్మ దేవతకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. ట్రస్టు బోర్డు చైర్మన్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. పాల్గొన్నారు.

నేడు సైన్స్ దినోత్సవం



రాకెట్ నమూనా

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రూపేష్ కుమార్ తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో 8,9, 10 తరగతుల విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పీఎస్‌ఎల్‌వీ రాకెట్ నమూనాను రూపొందించారని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


జేసీకి ఆహ్వానపత్రిక అందజేస్తున్న చైర్మన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు మంగళవారం పలువురిని ఆహ్వానించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు, ఆలయ విరాళదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగర మేయర్ డాక్టర్ శిరీషను ఆహ్వానించారు. ఏఈవో ధనపాల్, సీసీ సుదర్శన్‌రెడ్డి, కామేశ్వరరావు, వేదపండితులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు



నాగలాపురం: నాగలాపురం బైపాస్ సమీపంలో శ్రీచెల్లేతమ్మ ఆలయం వద్ద మంగళవారం చెట్టును కారు ఢీకొంది. స్థానికుల కథనం మేరకు.. నాగలాపురం నుంచి తిరుపతి వెళుతున్న కారు రోడ్డుకు అడ్డంగా వచ్చిన ఆవును తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొంది. కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతినింది. కారు నడుపుతున్న భాస్కర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

3న పల్స్ పోలియో


సత్యవేడు : మార్చి 3న నిర్వహించే పోలియో కార్యక్రమాన్ని సమన్వయంగా విజయవంతం చేయాలని దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీకృష్ణ కోరారు. మంగళవారం పల్స్‌పోలియో కార్యక్రమంపై ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు.

పామాయిల్ తోటల పెంపకంతో ఆదాయం


మాట్లాడుతున్న మురళి

ఏర్పేడు: పామాయిల్ తోటల పెంపకంతో రైతులు ఆదాయాన్ని ఆర్జించవచ్చని తిరుపతి త్రీఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ ఏజీఎం మురళి అన్నారు. మంగళవారం మండలంలోని మడిబాకలో పామాయిల్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తోటల పెంపకం, ప్రభుత్వ రాయితీలు, లాభాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. క్లస్టర్ అధికారులు గురునాథం, రాజేష్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దేవేంద్రబాబు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురంలో టీటీడీ అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఆలయంలోని సేవా మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు మాట్లాడుతూ మార్చి 9 నుంచి 18వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ రెడ్డి, అధికారులు సదాశివయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో భద్రతకు ప్రాధాన్యం

- శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ శేఖర్
- వారోత్సవాలు ప్రారంభం



వారోత్సవాలను ప్రారంభిస్తున్న శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ శేఖర్

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలో భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వైస్ ప్రెసిడెంట్(ప్రాజెక్ట్సు) ఎస్. శేఖర్ అన్నారు. మంగళవారం శ్రీసిటీలో 53వ జాతీయ భద్రతా వారోత్సవాలను ఆయన జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసిటీ సిబ్బంది, స్థానికులకు ఈ కార్యక్రమం ప్రాధాన్యం వివరించి వారిచే భద్రతా ప్రతిజ్ఞా చేయించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో యాక్సిడెంట్లు, ఇతర ప్రమాదాల నివారణకు భద్రతా అంశాలపై విస్తృత ప్రచారం కల్పించడంతోపాటు ప్రజలకు అవగాహన పెంచడమే ఈ భద్రత వారోత్సవాల లక్ష్యమని తెలిపారు. పని ప్రదేశాల్లోఅధిక శాతం ప్రమాదాలు అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్ల సంభవిస్తాయని, దీన్ని నివారించేందుకు శ్రీసిటీ, పరిశ్రమల యాజమాన్యాలు తరచూ ఉద్యోగులకు, కార్మికులకు భద్రత పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భద్రతా వారోత్సవాలలో భాగంగా వారం రోజుల పాటు వివిధ అవగాహనా కార్యక్రమాలతోపాటు శ్రీసిటీ ఉద్యోగులు, ఈ ప్రాంతంలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీసిటీ మేనేజర్(సేఫ్టీ) నరేంద్రబాబు తెలిపారు. మార్చి 4న ముగింపు ఉత్సవం జరగుతుందన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్


న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను వరుస సెలవుల కారణంగా 16న నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. మంగళవారం న్యాయమూర్తి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీయే రాజమార్గమని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమన్నారు. కక్షిదారులు సమయం,డబ్బు ఆదా చేసుకునేందుకు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్య సురక్షతో నాణ్యమైన వైద్యం


బీఎన్‌కండ్రిగ: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


సత్యవేడు: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనిత

బుచ్చినాయుడుకండ్రిగ : జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామంలోనే నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు వైద్యాధికారి దివాకర్ తెలిపారు. మండలంలోని వీఎస్‌పురం సచివాలయంలో వైఎస్సార్ క్లినిక్ వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పైసా ఖర్చు లేకుండా ఉచితంగా 7 రకాల పరీక్షలు చేసి, మందులు, కంటి అద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. మంచానికే పరిమితమైన వారికి ఏఎన్‌ఎం నుంచి స్పెషలిస్ట్ డాక్టర్ల వరకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. షుగర్, బీపీ, రక్త పరీక్షలు చేశారు. బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులు, తగిన బరువులేని పిల్లలు, క్షయ, కుష్ఠు, వ్యాధులు కలిగిన వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మణినాయుడు, సర్పంచ్ సిద్ధమ్మ, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి రజినీకాంత్, వైద్య సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

సత్యవేడు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం చెరివి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి అనిత , రుయా వైద్యశాల చిన్న పిల్లల డాక్టర్ నాగమణి, ప్రవీణ్ శిబిరంలో 402 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. 24 మందికి కంటి పరీక్షలు చేశారు. 230 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, ఎంపీహెచ్‌ఓ రవీంద్ర, సూపర్ వైజర్ పవనకుమారి, ఏఎన్‌ఎం కోషి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

24 వేల మంది పేదలకు పట్టాలిచ్చింది ఎవరు?


మీడియాతో మాట్లాడుతున్న మన్యం శ్రీనివాసులురెడ్డి

- ఎమ్మెల్యే మధును విమర్శిస్తే ఊరుకోం
- వామపక్షాలకు వైఎస్సార్ సీపీ నేతల హుకుం

రేణిగుంట: కరకంబాడిలో రెవెన్యూకు, ఓ ప్రైవేటు వ్యక్తికి మధ్య నడుస్తున్న వివాదాస్పద భూముల్లోకి చొరబడి అక్రమంగా గుడిసెలు వేస్తే, అధికార యంత్రాంగం వాటిని తొలగిస్తే వామపక్ష నాయకులు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని విమర్శించడం వారి చౌకబారుతనానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులు మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ నెలరోజులుగా ప్రభుత్వ స్థలంలో దౌర్జన్యంగా గుడిసెలు వేసి, స్థానికేతరులైన వందలాది మంది పేదలకు వామపక్ష నాయకులు ఆశచూపి ఇక్కడికి తీసుకొచ్చారన్నారు. వారి నుంచి రోజుకు ఇంత అని అక్రమ వసూలు చేసి సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. ఇంటిస్థలం వస్తుందన్న ఆశతో పేదలు వామపక్ష నాయకుల ఊబిలో చిక్కుకుని అవస్థలు పడ్డారన్నారు. రాజకీయ కుట్రకు తెరలేపిన వామపక్ష నాయకులు ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే ఊరుకోమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్లు ఇచ్చారే తప్ప, ఇళ్లు కూల్చే సంస్కృతి లేదన్నారు. నియోజకవర్గంలో 24వేల మంది పేదలకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఇంటిపట్టాలు ఇప్పించారని గుర్తు చేశారు. భూవివాదానికి, ఎమ్మెల్యేకు ఏమిటి సంబంధం అని నిలదీశారు. ఆయన అనుకుని ఉంటే 30రోజుల పాటు వీరు ఉద్యమించి ఉండేవారా..? అని ప్రశ్నించారు. ఇంకోసారి ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసులుయాదవ్, పీడీ బాబు, కృష్ణమూర్తి, ఎంపీటీసీ కన్నయ్య, బాబూరావ్, కె.పార్థసారథి, ఎం.సుబ్రమణ్యం, ఐ.శివ, పీడీ మహేష్, కె.దీన, దిలీప్, రమేష్, రాజేష్, గురుమూర్తి, రమేష్‌రాజు, వెంకటాద్రి, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం విరాళం


పశుగ్రాసంఅందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం గోశాలకు తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామానికి చెందిన నాగవరపు వెంకటయ్య, కుమారుడు మాధవరావు ట్రక్కు పశుగ్రాసాన్ని మంగళవారం విరాళంగా అందజేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు వారిని ఆశీర్వదించారు. గోశాల ఇన్‌చార్జి నాగవరపు వెంకటయ్య, సిద్ధలయ్య పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం బస్తాల వితరణ


బియ్యం బస్తాలను అందజేస్తున్న కరుపయ్య

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధ శ్రీసర్వ మంగళసమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయానికి తమిళనాడు రెడ్‌హిల్స్‌కు చెందిన వాహనాల తనిఖీ అధికారి(ఆర్‌టీఓ) కరుపయ్య 22,500 విలువ జేసే 15బియ్యం బస్తాలను అందజేశారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఈనెల 29 నుంచి మార్చి 10వ తేదీ వరకు జరగ నున్న మహాశివ రాత్రి ఉత్సవాలలో పాల్గొనే భక్తులకు అన్నదానం చేసేందుకు బియ్యం బస్తాలు అందజేసినట్లు తెలిపారు. దేవస్థానం అధికారులు కృతజ్ఞతలు తెలిపి, శ్రీస్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు.

గదుల వేలంతో రూ.9.53 లక్షల ఆదాయం

పిచ్చాటూరు: పిచ్చాటూరు పంచాయతీకి చెందిన శ్రీగంగాధర్ రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లోని 23 గదులు వేలం ద్వారా రూ.9.53 లక్షల ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఉదయం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన వేలం జరిగింది. వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయితీ అభివృద్ధికి వెచ్చించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. మార్కెట్, జంతువధ శాలకు త్వరలో వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈఓపీఆర్‌డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి రాధిక తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు


పథకాల లబ్ధిని వివరిస్తున్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగనన్న పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జ్ కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె శ్రీకాళహస్తి మండలం ఊరందూరు ఎస్టీకాలనీ, మద్దిలేడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్కాచెల్లెమ్మల ముఖాల్లో చిరునవ్వులు చూడాలని మహిళా సభ్యుల రుణాలను మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని తెలిపారు. మహిళాభివృద్ధి కోసం పలు పథకాలను అమలు చేసినట్లు పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రజలు కష్టకాలంలో ఉన్న సమయంలో ముఖంచాటేసి ఎన్నికల సమయంలో కనిపించే నాయకులను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. కరోనా వంటి కష్టకాలంలో ప్రజలవెంట నిలిచి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.కోట్ల నిధులు వెచ్చించి పలు సహాయ కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు.

బొజ్జల ఇలాకాలో పవిత్రారెడ్డికి ఘన స్వాగతం

మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి స్వగ్రామం ఊరందూరు పంచాయతీ పరిధిలో పర్యటించిన బియ్యపు పవిత్రారెడ్డికి గడప గడపలో ప్రజలు కర్పూర హారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఆమె గ్రామంలోకి ప్రవేశిస్తుండగా పెద్ద ఎత్తున నాయకులు, ప్రజలు, కార్యకర్తలు పొలిమేర వద్దకు చేరుకుని డప్పులు వాయిస్తూ, పూలు చల్లుతూ, పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చుతూ పవిత్రారెడ్డికి స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వయ్యాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ భానుయాదవ్, సర్పంచ్ లక్ష్మి, గురవయ్య, నాయకులు అమాస చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, దిలీప్, శివ, సాయి, పవన్, రంగయ్య, చెంచయ్య యాదవ్, యధుభూషణ్ రాయల్, రుద్రయ్య, మనోహర్‌రెడ్డి, చెంచయ్యనాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, కాళప్పరెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి

సత్యవేడు: క్రమం తప్పకుండా మందులు వాడితే కుష్టు వ్యాధిని నివారించవచ్చని డీఎస్‌ఎంఓ (తిరుపతి)డాక్టర్ బి.రాజ అన్నారు. మంగళవారం దాసుకుప్పం పీహెచ్‌సీలో కుష్టు వ్యాధి గ్రస్తులకు మందులు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధిగ్రస్తులు ఆర్యోగ్య కేంద్రాల్లో చికిత్స క్రమం తప్ప కుండా చికిత్స పొందాలని సూచించారు. కుష్టు వ్యాధి ద్వారా అంగవైకల్యం కలిగిన వారికి ఉచితంగా ప్రత్యేకంగా తయారు చేసిన 'ఎంసీఆర్ చెప్పులు'ను అందజేశారు. డీఎల్‌టీఓ అరుణసులోచన ఆధ్వర్యంలో అవసరమైన మందులు, చెప్పులు అందజేస్తున్నట్లు రాజ తెలిపారు. వ్యాధిగ్రస్తులకు సంవత్సరానికి రెండు పర్యాయాలు చొప్పులు అందజేస్తామన్నారు. దాసుకుప్పం పరిధిలో 9మందికి చెప్పులు అందజేశారు. డాక్టర్ మురళీ కృష్ణ, డిప్యూటి డెమో కిరణ్ (తిరుపతి), రమణ (ఫిజియోథెరఫిస్టు), ఎంపీహెచ్‌ఓ సుబ్రమణ్యం, ఎస్‌ఎంలు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: కుష్టు రోగులపై వివక్ష విడనాడాలని పలువురు సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు రోగులకు చెప్పులు అందజేశారు. లెప్రసీ నివారణ జిల్లా అధికారి డాక్టర్ రాజు మాట్లాడుతూ ప్రాథమిదశలో గుర్తించి, చికిత్స పొందితే వ్యాధిని పూర్తిగా నివారించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రత్యేకంగా తయారు చేసి ఎంసీఆర్ చెప్పులు రెండు జతలను ఏటా ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందిస్తున్నామని అన్నారు. డాక్టర్ రాగసుధ, సీహెచ్‌వో శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ రావచంద్రయ్య పాల్గొన్నారు.

ఉపాధిలో రూ.68,927 రికవరీకి ఆదేశం


బహిరంగ సమావేశంలో పాల్గొన్న పీడీ శ్రీనివాస ప్రసాద్

- సిబ్బంది తప్పిదాలకు రూ.26 వేలు అపరాధం
- డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

పిచ్చాటూరు: ఉపాధి పనుల్లో లెక్కలు తేలని పనులకు సంబంధించి రూ.68,927 రికవరీకి డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. సామాజిక తనిఖీ బృందం చేపట్టిన పరిశీలనల్లో వెల్లడైన వివరాలను డీఆర్పీలు వినిపించారు. ఉపాధి నిధులతో చేపట్టిన పనుల్లో దుర్వినియోగమైన రూ.68,927కు సంబంధింత అధికారులు, సిబ్బంది నుంచి రికవరీకి పీడీ ఆదేశించారు. ఇందులో రూ.49,827 ఉపాధి సిబ్బంది నుంచి, రూ.19052 హౌసింగ్ సిబ్బంది నుంచి రికవరీ చేయాలని వివరించారు. వీటితో పాటు ఉపాధి సిబ్బంది చేసిన వివిధ తప్పిదాలకు రూ.26 వేలు అపరాధం విధించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ వేసవి ప్రారంభమైనందున ప్రతి గ్రామంలో విరివిగా ఉపాధి పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. పూడిక తీత, పూల సాగు, మామిడి, కొబ్బరి తోటలు, పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మెన్ రాసరాయ నాయుడు, ఏపీడీ సరిత, సీఎల్‌ఆర్‌సీ చంద్రశేఖర్ రాజు, సింగిల్ విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ కిరణ్‌కుమార్, ఏపీఓలు నాగభూషణమ్మ, సుధాకర్, జేఈ పుష్పరాజ్ పాల్గొన్నారు.

ఏడు పోలింగ్ కేంద్రాల మార్పు


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రామ్మోహన్

సత్యవేడు: సత్యవేడు(ఎస్సీ) అసెంబ్లీ నియోజవర్గం పరిధిలో ఏడు పోలింగ్ కేంద్రాలను మార్పు చేయనున్నట్లు ఓటర్ల నమోదు అధికారి బి.రామ్మోహన్ (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ అండ్ ప్రొటక్షన్, తిరుపతి) తెలిపారు. మంగళవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల మార్పు ఫారం 6,7,8 క్లైమ్‌లపై సందేహాలు నివృత్తి చేశారు. వదయ్యపాలెంలో-2, కదూరులో ఒకటి, పిచ్చాటూరు మండలంలోని వెంగళత్తూరులో ఒకటి, కేవీబీపురం మండలం కొత్తూరులో ఒకటి, నారాయణవనం మండలంలోని ఎరికంబట్టు-1, పిచ్చాటూరు మండలంలోని వెంగళత్తూరు పోలింగ్ కేంద్రాల మార్పునకు చర్యలు చేపట్టామన్నారు. బీజేపీ నాయకులు ఏరాసి మురళికృష్ణ, సి.వెంకటేశ్వర్లు, టీడీపీ ప్రతినిధులు దిలీప్, బాలరాజ్, కే. మునస్వామి(సీపీఎం), తహసీల్దార్ రామాంజనేయులు(సత్యవేడు), శంకర్‌రావు(నారాయణవనం), పీఎండీ ఆలీఖాన్ (బుచ్చినాయుడుకండ్రిగ), డీటీలు రవిచంద్ర, వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాలొన్నారు.

ఇళ్ల పట్టాలకు ఉచిత రిజిస్ట్రేషన్

ఏర్పేడు: జగనన్న కాలనీల్లోని ఇళ్ల పట్టాలకు లబ్ధిదారులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సర్పంచ్ లలిత అన్నారు. మంగళవారం మండలంలోని పాపానాయుడుపేట సచివాలయంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పేదలందరికీ సొంతిల్లు ఉండాలని సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి స్థలాలను పంపిణీ చేసి ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని తెలిపారు. మర్రిమంద జగనన్న కాలనీలో సుమారు 58 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినట్లు వివరించారు. భవిష్యత్తులో రుణాలు పొందేందుకు వీలుగా ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి ఇళ్ల పట్టాలు ఇస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల నాయకుడు కరుణాకరన్, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, వీఆర్వో జయపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తయిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్తువరత్తూరు గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఇళ్ల గృహ లబ్ధిదారుల ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయినట్లు గ్రామకార్యదర్శి నందిని తెలిపారు. గతంలో పట్టాలు పొందిన లబ్ధిదారులకు ప్రభుత్వం సచివాలయాల ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తోందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఇంటిపై బ్యాంకులో రుణాలను పొందవచ్చని తెలిపారు. వీఆర్‌ఓ మురళి, వలంటీర్లు పాల్గొన్నారు.